క్లుప్తంగా

వికలాంగుల ఆశ్రమంలో అన్నదానం



వికలాంగుల ఆశ్రమంలో వృద్ధురాలికి భోజనం తినిపిస్తున్న సుల్తానా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సాటి వారిని ఆదుకోవడంలోనే ఆనందం ఉంటుందని వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు షేక్ సుల్తానా అన్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ఆమె స్థానిక తంగెళ్లమూడిలోని వికలాంగుల ఆశ్రమంలో ఆశ్రయం పొందుతోన్న వారికి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో విభిన్న ప్రతిభావంతులు, దివ్యాంగులు, వృద్ధులు ఎంతోమంది ఉన్నారని, అటువంటి వారికి ప్రతి ఒక్కరూ తమకు కలిగిన దానిలో కొంత భాగాన్ని అందించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎండీ ఇలియాస్ పాషా, అహలె సున్నత్‌వల్ జమాత్ సంస్థ ప్రతినిధులు షేక్ సాబిర్ హుస్సేన్, ఎండీ ఇక్బాల్, ఎండీ గాలబ్ అలీ, ఎండీ అనీస్‌పాషా, అమీర్ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

భార్యను కొట్టిన భర్తపై కేసు

ఏలూరు టౌన్: మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని భర్త తీవ్రంగా కొట్టటంతో భార్య గాయాలపాలైంది. ఏలూరు లంకపేటకు చెందిన కోడి లలిత భర్త ఆంజనేయులు రాడ్ బెండింగ్ పని చేస్తుంటాడు. వీరికి ముగ్గురు సంతానం. కొన్ని నెలలుగా పనికి వెళ్లకుండా ఆంజనేయులు తాగి ఇంటికి వస్తున్నాడు. ఇటీవల లలిత బ్యాంకు ఖాతాలో పడిన అమ్మఒడి పథకం సొమ్ములో రూ.10 వేలు ఆంజనేయులు తీసేసుకున్నాడు. కొంత సొమ్మును లలిత కుటుంబ అవసరాల నిమిత్తం వినియోగించింది. ఇంకా మిగిలిన రూ.వెయ్యి కూడా మద్యం తాగేందుకు ఇవ్వాలంటూ ఆంజనేయులు తన భార్యను కొట్టాడు. గాయాలపాలైన లలిత ఏలూరు జీజీహెచ్‌లో చికిత్స నిమిత్తం చేరింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఏలూరు టూటౌన్ సీఐ పి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేపట్టారు.

నేడు కోమటిలంకలో జగనన్న సురక్ష

ఏలూరు రూరల్: ఏలూరు మండలం కోమటిలంక సచివాలయ వద్ద గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం శనివారం ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమవుతుంది. సాయంత్రం నాలుగు గంటలకు అర్జీదారులకు ధ్రువపత్రాలు అందించడంతో పాటు క్షేత్ర స్థాయి సమస్యలపై అధికారులు వినతిపత్రాలు స్వీకరించి పరిష్కరించనున్నారు.

వలంటీర్లపై అసత్య ఆరోపణలు సిగ్గుచేటు

వలంటీర్లకు వందనం

ఏలూరు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించిన వలంటీర్లపై అసత్య ఆరోపణలు చేస్తే సహించం అంటూ ప్రజలు హెచ్చరిస్తున్నారు. ప్రజలకు సేవ చేసే వలంటీర్లపై జనసేన నాయకుడు పవన్‌కళ్యాణ్ తప్పుడు ఆరోపణలు చేయడం అన్యాయమంటున్నారు. రాజకీయ నాయకులు స్వార్థం కోసం వలంటీర్ల వ్యవస్థపై అసత్య ప్రచారం చేయడం సిగ్గు చేటని చెబుతున్నారు. కుల, మత వర్గ భేదాలు లేకుండా వలంటీర్లు ప్రతి ఒక్కరికీ పథకాలు అందిస్తున్నారని కొనియాడుతున్నారు. వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటుతో దళారీ వ్యవస్థ కనుమరుగయ్యిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఏలూరులో వృద్ధురాలకు ఫింఛన్ అందిస్తున్న వలంటీర్

పవన్‌వి తప్పుడు మాటలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తోన్న అమ్మఒడి పథకం నాకూ వర్తిస్తోంది. ఈ డబ్బులతో నా పిల్లలను చదివించుకుంటున్నాను. గతంలో స్కూల్ ఫీజుల కట్టలేక చాలా ఇబ్బంది పడేవాళ్లం. ఇప్పుడు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఫీజు కడుతున్నాం. ప్రభుత్వం అమ్మఒడి పథకం పేదలకు ఇవ్వడం లేదంటూ పవన్‌కళ్యాణ్ మీటింగుల్లో చెప్పడం అన్యాయం. మా వలంటీర్ వల్లనే మేం సంక్షేమ పథకాలు అందుకుంటున్నాం. ఎవ్వరికీ ఒక్కపైసా కూడా ఇవ్వలేదు. అలాంటి వలంటీర్లపై పవన్‌కళ్యాణ్ తప్పుడు మాటలు మాట్లాడడం మంచిది కాదు. వలంటీర్ల వల్లనే పేదలు అందరికీ పథకాలు అందుతున్నాయి. లేదంటే అధికారులు ఎవరికి నచ్చితే వారికే పథకం ఇచ్చేవారు.

– జి.హైమావతి, వైఎస్సార్ కాలనీ

పవన్‌కళ్యాణ్ క్షమాపణ చెప్పాలి



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాక ముందు నెలనెలా పింఛన్ కోసం ఎండలో, ఆరుబయట అరుగులపైనా గంటల తరబడి కూర్చోవల్సి వచ్చేంది. ఇప్పుడు ప్రతినెలా ఉదయం 6 గంటలకే వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ ఇస్తున్నారు. కొద్దినెలల క్రితం మా వలంటీర్ వేరే ఉద్యోగంలో చేరాడు. అయినప్పటికీ మరో వలంటీర్ అనూష మా పింఛన్ అందిస్తుంది. అనూష తర్వాత లయకు అదనంగా బాధ్యతలు అప్పగించినా ఎలాంటి ఇబ్బంది పడకుండా సంతోషంగా నా లాంటి వృద్ధులు, వికలాంగులకు నెలనెలా పింఛన్ అందిస్తున్నారు. ఇలాంటి వలంటీర్లపైనా, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపైనా పవన్‌కళ్యాణ్ అనుచిత వాఖ్యలు చేయడం సరికాదు. పవన్‌కళ్యాణ్ క్షమాపణ చెప్పాలి.

– పులి కళ్యాణరావు, ఇందిరాకాలనీ, వెంకన్నచెరువు

వలంటీర్ల సేవలను తెలుసుకోవాలి



వలంటీర్ వ్యవస్థ ఏర్పాటుచేయాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన పేదలకు ఎంతో మేలు చేసింది. నాకు ఏటా ప్రభుత్వం వైఎస్సార్ చేయూత పథకం ద్వారా రూ.10 వేలు అందిస్తోంది. మొదట ఈ పథకం గురించి నాకు తెలియదు. మా వలంటీర్ జి.దేవి మాకు పథకం గురించి చెప్పి నాతో అర్జీ పెట్టించింది. ఇప్పుడు ప్రతి ఏటా జగన్‌మోహన్‌రెడ్డి రూ.10 వేలు ఇస్తున్నారు. ఈ డబ్బుతో చిన్నపాటి వ్యాపారం చేసుకుంటున్నాను. ఇలాంటి మంచి పనులు చేస్తున్న వలంటీర్లుపైనా, జగన్‌మోహన్‌రెడ్డిపైనా పవన్‌కళ్యాణం దుర్భషలాడడం నాకు బాధేసింది. ఇలాంటి మాటలు మాట్లాడేతప్పుడు మా లాంటి పేదలకు జరిగిన న్యాయం ఎంటో తెలుసుకోవాలి. లేదంటే ప్రజలు ఛీ కొడతారు.

– సీహెచ్ రమాభారతి, వైఎస్సార్ కాలనీ

వలంటీర్లకు అండగా ఉంటాం



ఈ ప్రభుత్వం మా కుటుంబానికి ఇంటి స్థలం ఇచ్చింది. ఇప్పుడు ఇల్లు కట్టుకునేందుకు రూ.1.80 లక్షలు ఇస్తోంది. వ్యాపారం కోసం వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఇప్పటి వరకు నాలుగు సార్లు రూ.10 వేలు చొప్పున రూ.40 వేలు మాకు వచ్చింది. ఇవన్నీ మేం వెళ్లి జగన్‌మోహన్‌రెడ్డికి చెప్పుకున్నామా. ఆయన నియమించిన వలంటీర్లకు చెప్పుకున్నాం. వలంటీర్ వల్లనే మాకు సంక్షేమ పథకాలు అందాయి. వలంటీర్లను ఇష్టమెచ్చినట్టు మాట్లాడితే మాకు బాధ కలుగుతుంది. వలంటీర్లను తిడితే నాలాంటి పేదలను తిట్టినట్టే కదా. మా లాంటి పేద కుటుంబాలు ఎన్నో వలంటీర్లకు అండగా ఉన్నాయి. వలంటీర్లను ఎవ్వరూ ఏమీ చేయలేరు. జగన్‌మోహన్‌రెడ్డి వల్లే వలంటీర్లు సేవలు చేస్తున్నారు.

– శీలం కుమారి, వైఎస్సార్ కాలనీ

చేనేతల్లో వెలుగులు నింపిన సీఎం జగన్



సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న బసవేశ్వర కర్షభక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఎన్నికల హామీ నెరవేర్చి చేనేత కార్మికుల జీవితాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారని శ్రీ బసవేశ్వర కర్షభక్తుల సంక్షేమ సంఘం ఏలూరు ప్రతినిధులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం నగరంలోని సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ ఉపాధ్యక్షుడు అల్లం సర్వేశ్వరరావు మాట్లాడుతూ కరోనా కష్టకాలంలోనూ చేనేత కార్మికుల కుటుంబాలలో వెలుగులు చూడాలనే కోరికతో ఏటా రూ.24 వేలు చొప్పున సాయం అందించారని చెప్పారు. ఐదేళ్లలో రూ.1.20 లక్షలు చొప్పున అందించడం సామాన్య విషయం కాదన్నారు. సమావేశంలో సంఘ గౌరవాధ్యక్షుడు పొన్నా కోటేశ్వరరావు, అధ్యక్షుడు శిద్దాని నాగ సూర్యనారాయణ, కార్యదర్శి శలా నాగ తిరుమలేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి తమ్మా రాజు, కోశాధికారి తమ్మా శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు తమ్మా గణపతి, వాసా వెంకటరమణ, చల్లా నాగరాజు, శలా ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ధరకు బియ్యం, కందిపప్పు



ప్రజలకు కందిపప్పు అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ చిరంజీవులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): బహిరంగ మార్కెట్లో నిత్యావసర ధరలు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ద్వారా ప్రజలకు తక్కువ ధరలకే కందిపప్పు, బియ్యం రైతు బజారుల్లో ప్రత్యేక కౌంటర్ల ద్వారా అందజేస్తున్నట్టు ఏలూరు మార్కెట్ కమిటీ చైర్మన్ నెరుసు చిరంజీవులు తెలిపారు. శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి ఆదేశాల మేరకు ఏలూరు వన్ టౌన్, పత్తేబాద రైతు బజారుల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేశారు. వన్‌టౌన్‌లో కౌంటర్‌ను చిరంజీవులు, పత్తేబాదలో కౌంటర్‌ను జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఆర్ సత్యనారాయణ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా చిరంజీవులు మాట్లాడుతూ మార్కెట్‌లో ధరలు పెరిగి బియ్యం, కందిపప్పు కొనుగోలుకు పేదలు పడుతున్న ఇబ్బందులను గమనించిన ముఖ్యమంత్రి ఈ ప్రత్యేక కౌంటర్లు రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారన్నారు. నగరంలోని రెండు రైతు బజారుల్లో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక కౌంటర్లను ప్రజలు వినియోగించుకుని ధరల భారం నుంచి విముక్తి పొందాలని కోరారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సత్యనారాయణరాజు మాట్లాడుతూ ప్రత్యేక కౌంటర్ల ద్వారా ప్రజలకు కేజీ కందిపప్పు రూ.134కు, బియ్యం స్వర్ణ రకం బియ్యం కిలో రూ.34, పీఎల్ రకం రూ.40, సోనామసూరి రకం రూ.48కే అందిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పౌర సరఫరాల అధికారులు లక్ష్మణ బాబు, వై. ప్రతాపరెడ్డి, ఎస్టేట్ ఆఫీసర్ ఎం. సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టాలి



హోటళ్లు, లాడ్జిల యజమానులతో మాట్లాడుతున్న సీఐ శివాజీ

ఏలూరు టౌన్: ఏలూరు త్రీటౌన్ పరిధిలోని హోటళ్లు, లాడ్జిల్లో అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టాలని , చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ కోమాకుల శివాజీ హెచ్చరించారు. ఏలూరు త్రీటౌన్ స్టేషన్‌లో శుక్రవారం హోటల్స్, లాడ్జిల నిర్వాహకులతో ఆయన ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాల నిరోధానికి చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. లాడ్జిల్లో బస చేసేవారి గుర్తింపు కార్డు, పూర్తి వివరాలు, ఫోన్ నెంబర్ తీసుకోవాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులుగా భావిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. లాడ్జిలు, హోటళ్లలో పేకాట ఆడితే సహించేదిలేదని హెచ్చరించారు.

సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు కోరారు. ఏలూరు నగర పాలక సంస్థ వద్ద రెండో రోజు శుక్రవారం మున్సిపల్ కార్మికుల దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి దనాల వెంకట్రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య, ఆర్ లింగరాజు, ఎ.జానుబాబు, బి.జగన్నాథరావు, పి.హైమావతి పాల్గొన్నారు.

వాహన మిత్ర పథకాన్ని వర్తింపజేయాలి

ఏలూరు (టూటౌన్): రవాణా రంగ కార్మికులందరికీ వాహన మిత్ర పథకం వర్తింపజేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు కోరారు. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ సమావేశం అధ్యక్షుడు బుద్దా సూరిబాబు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. లింగరాజు, యూనియన్ జిల్లా కార్యదర్శి జె.గోపి మాట్లాడుతూ దేశంలో ఏటా రూ.20 వేల కోట్లు ఆదాయాన్ని సంపాదించి పెడుతున్న రవాణా రంగం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ సుందరయ్య, గొడు రవీంద్రబాబు, దోమతోటి థామస్, పోచారపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

ఏలూరు టౌన్: ఏలూరు టూటౌన్ పరిధిలోని ఒక వ్యక్తి అదృశ్యంపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏలూరు కొత్త పేటకు చెందిన జేసీబీ డ్రైవర్ దల్లి నాగరాజు (30) రెండు రోజుల క్రితం ఇంటినుంచి బయటకెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	100	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	44
వంకాయలు (కాంతులు)	20	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	05-07
బెండకాయలు	34	కంద	36
పచ్చిమిర్చి	76-84	బీట్‌రూట్	42
కాకర కాయలు	40	కీరా దోస	30
బీరకాయలు	32	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	48	అల్లం	188-270
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	42	పాలకూర	12
దొండకాయలు	16	చుక్కకూర	12
బంగాళదుంపలు	26	తోటకూర	12
ఉల్లిపాయలు	24	గోంగూర	07
గోరుచిక్కుడు	32	పుదీనా	05
దోసకాయలు	20-30	బఠాణీ	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	100
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	34

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	34
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	35
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	28

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	14
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	21
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	27
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	18
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	రద్దు
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	32
ఏలూరు -తిరుపతి	16.00	4830	31

కేంద్ర విధానాలతో రైతుల ఆత్మహత్యలు



సదస్సులో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య

ఏలూరు (టూటౌన్): వ్యవసాయం తీవ్ర సంక్షోభం, నష్టాలు, రైతుల ఆత్మహత్యలకు కేంద్రంలో మోదీ ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలే కారణమని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) జిల్లా సదస్సులో నాయకులు ధ్వజమెత్తారు. ఈ సదస్సు స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయం హాలులో శుక్రవారం నిర్వహించారు. అన్ని పంటలకూ కనీస మద్దతు ధరలను నిర్ణయించాలని, విద్యుత్ బిల్లును పార్లమెంటులో ఉపసంహరించుకోవాలని, రైతు రుణ ఉపశమన చట్టం ఆమోదించాలని, లేబర్ కోడ్లను రద్దు చేసి కార్మికుల హక్కులను పునరుద్ధరించాలని కోరారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.కృష్ణయ్య, కేవీవీ ప్రసాద్, కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జెట్టి గురునాథరావు, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మల సురేష్, ఏఐకేకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు డి.రంగనాథ్, రైతు కూలీ సంఘం (ఏపీ) జిల్లా కార్యదర్శి కేఎస్‌కే బాషా, బీకేఎంయూ జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడారు.

లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

దెందులూరు: విద్యాభివృద్ధి, పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, విద్యార్థుల భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం నాడు – నేడు పథకానికి ఇస్తున్న ప్రాధాన్యతను ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు నూరుశాతం లక్ష్యాల సాధనకు కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి ఎవీఎస్‌వీ ప్రసాద్ అన్నారు. శుక్రవారం దెందులూరు ఎంఈఓ కార్యాలయంలో మండలంలోని నాడు – నేడు ఫేజ్–2 అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సమన్వయంతో జరిగిన పనులు, జరుగుతోన్న పనులు కార్యాచరణ ప్రణాళిక, రికార్డుల నిర్వహణ ప్రణాళికాబద్ధంగా చేయాలన్నారు. ఈ పనులపై తరుచూ మండల విద్యాధికారుల ఆకస్మిక తనిఖీలు ఉంటాయన్నారు. మండల, జిల్లా కార్యాలయానికి నాడు – నేడు ఫేజ్–2 ప్రగతిని విధిగా తెలియజేయాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. అనంతరం పాఠశాలలవారీగా అభివృద్ధి పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మణిపూర్ ఘటన విచారకరం

ఏలూరు (టూటౌన్): ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో జరిగిన ఘటన విచారకరమని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మెండెం సంతోష్ కుమార్ అన్నారు. స్థానిక నరసింహారావుపేటలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్త్రీలను గౌరవంగా చూసే దేశంలో వివక్షతో స్త్రీలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసి చంపడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. విలువలు కాపాడాల్సిన పాలకులే నోరు మెదపకపోవడం బాధాకరమన్నారు. మణిపూర్ ఘటనపై ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో స్పందించి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. రాబోయే రోజుల్లో క్రైస్తవులతో కలిసి ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సదస్సులు, చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

దేవదాయ షాపుల లీజుకు 5న వేలం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని దేవదాయ శాఖ పరిధిలోని వివిధ సత్రాలకు చెందిన షాపులను లీజుకిచ్చే నిమిత్తం ఆగష్టు ఐదో తేదీన వేలం నిర్వహించనున్నట్టు ఆయా సత్రాల కార్యనిర్వహణాధికారి సీహెచ్‌వీ నాగ మునేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కత్తేపు వీధిలో శ్రీ అన్న, వస్త్ర, వైద్య, విద్యాదాన సమాజానికి చెందిన షాపు వేలంలో పాల్గొనేందుకు రూ.5 వేలు, చదలవాడ వారి వీధిలోని చెరుకువాడ వారి సత్రానికి చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌లో ఒక షాపు లీజుకు రూ.20 వేలు ధరావతు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఔత్సాహిక వ్యాపారులు పాల్గొని షాపులను దక్కించుకొని వ్యాపారాభివృద్ధి పొందవచ్చని పేర్కొన్నారు.

24న రైతు ధర్నా

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద ఈ నెల 24న నిర్వహించే రైతుల ధర్నాను విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ కోరారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవన్‌లో కౌలు రైతు సంఘం ఏలూరు జిల్లా సమావేశం జిల్లా అధ్యక్షుడు గన్ను వెంకట్రావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర విధానాల ఫలితంగా రైతులు రుణభారంలో కూరుకుపోయారన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పెదపాడు: కుల, మత, ప్రాంత, వర్గ బేధం లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. పెదపాడు తోటగూడెంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రాబోయే రోజుల్లో సీఎం జగన్‌ను, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిని మంచి మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ధ్రువ పత్రాలను అందించారు. నాయకులతో కలిసి మొక్కలు నాటారు. ఏఎంసీ అధ్యక్షుడు అప్పన కనక దుర్గాప్రసాద్, ఎంపీపీ బత్తుల రత్నకుమారి, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, ఏలూరు డివిజన్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కత్తుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం

దెందులూరు: జగనన్న సురక్ష ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారమవుతున్నాయని ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, మండల ప్రత్యేకాధికారి ఎస్ఎన్ కృపావరం అన్నారు. కొవ్వలిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. దెందులూరు మండలాల సచివాలయ కన్వీనర్ వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు కట్టా ఏసుబాబు, గొల్ల కిరణ్, మండల వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, సొసైటీ చైర్మన్ కొమ్మిన రాము, ఎంపీటీసీ గౌరిపర్తి వరలక్ష్మి రంగారావు, తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య, ఎంపీడీఓ ఏబీవీవీ లక్ష్మి, గ్రామ కార్యదర్శి రంగనాయకమ్మ ధ్రువ పత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు.